నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

5 | వరంగల్, బుధవారం 4 జూన్ 2025 | MAHABUBABAD




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పక్కన వేం నరేందర్‌రెడ్డి, రాంచంద్రూనాయక్, బలరాం నాయక్, తక్కళ్లపల్లి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కవిత, మురళీనాయక్, శంకర్ నాయక్

# దార్శనికుడు అంబేద్కర్

- గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఇనుగుర్తిలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ
- పాల్గొన్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి, జిల్లా అధ్యక్షురాలు కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

ఇనుగుర్తి, జూన్ 3 : భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచానికే దార్శనికుడని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో గాయత్రి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సహకారంతో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయన ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. అంతకు ముందు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళల కోలాటాలు, ఆట పాటల నడుమ వేల మంది అంబేద్కర్‌వాదులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇనుగుర్తి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పప్పుల వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వద్దిరాజు మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వారు కాదని, దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన ఆయన అందరివాడని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. రాజకీయ నాయకులు పార్టీలకతీతంగా గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పెట్రోలియం, సహజ వాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యుడిగా వివిధ చమురు సంస్థల నుంచి రూ. 7 కోట్ల నిధులు తీసుకొచ్చి ఇనుగుర్తి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు అధునాతన భవనాలు నిర్మించేందుకు యత్నిస్తుంటే కలెక్టర్ సహకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడాలని, అలాగే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని ఆయన నరేందర్‌రెడ్డిని కోరారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతని, ఆయన ఆశయాలు కొనసాగించాలన్నారు. ఇనుగుర్తి మండలానికి కార్యాలయాలు, కళాశాలలు మంజూరు చేయించి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో రాజ్యాంగంపై కుట్రలు, దాడులు జరుగుతున్నాయని, అవి పేదల మీద జరిగే దాడులని, వాటిని ఆపేయాలని కోరారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బోధించు, సమీకరించు, పోరాడు అనే గొప్ప నినాదం ఇచ్చిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కోతలు విధించొద్దని, విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆయన కోరారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన పసునూరి జంపయ్య అంబేద్కర్‌పై రాసిన పాట సీడీని రవిచంద్ర, ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, వద్దిరాజు కిషన్, దేవేందర్, వెంకన్న, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, కేసముద్రం ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిప్పలపల్లి ఐలయ్య, జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సామేల్, రాష్ట్ర కార్యదర్శి పాలమాకుల జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కరోనా పుకార్లు నమ్మొద్దు

- ఉమ్మడి జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు
- వరంగల్ డీఎంహెచ్‌వో సాంబశివరావు స్పష్టీకరణ



వరంగల్‌చౌరస్తా, జూన్ 3: ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని వరంగల్ జిల్లా వైద్యాధికారి సాంబశివరావు సూచించారు. వరంగల్ నగరంలో కరోనా కేసులు నమోదయ్యాయంటూ మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఎంజీఎం హాస్పిటల్‌కు కూతవేటు దూరంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో ఆరుగురికి కరోనా పాజిటివ్ వచ్చిందని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో ఒక్కసారిగా నగర ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' వరంగల్ డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్నా ఉమ్మడి జిల్లాలో మాత్రం ఒక్క కేసు కూడా నమోదు కాలేదని తేల్చి చెప్పారు. తప్పుడు ప్రచారం చేసిన సోషల్ మీడియా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రేషన్.. పరేషాన్!

- చిరిగిన సంచుల్లో షాపులకు సరఫరా
- బియ్యం తక్కువ వస్తుండడంతో ఆందోళనలో డీలర్లు
- లబ్ధిదారులకు అందించలేక ఇబ్బందులు
- బ్యాగులను సైతం అమ్ముకోలేకపోతున్నామని ఆవేదన
- వే బ్రిడ్జి ద్వారా కాంటా పెట్టాలని వేడుకోలు



రేషన్ బియ్యం వస్తున్న చిరిగిన సంచులు



వే బ్రిడ్జి ద్వారా బియ్యం కాంటా వేయాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిని కోరుతున్న ఇప్పగూడెం డీలర్లు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 3: రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం డీలర్లకు తంటాలు తెచ్చిపెడుతున్నది. నెల మొత్తం నిరుపేదలు వీటిని వండుకొని తింటున్నారో.. లేదో తెలియదు కానీ, డీలర్లు మాత్రం కడుపు మాడ్చుకుంటున్నారు. చిరిగిన సంచుల్లో సరఫరా చేస్తుండడంతో బియ్యం తక్కువ వచ్చి పంపిణీలో ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ డీలర్లకు బియ్యం సరఫరా జరుగుతున్నది. అయితే చిరిగిన సంచుల్లో తరలిస్తుండడంతో లారీల్లో లోడింగ్, రేషన్ షాపుల్లో అన్‌లోడింగ్ చేసే సమయంలో బియ్యం కిందపోయి తక్కువగా వస్తున్నాయని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో బ్యాగులో 50.600 కిలోల బియ్యం ఉండాల్సి ఉండగా 50 కిలోలు కూడా రావడం లేదంటున్నారు. మండలంలో మొత్తం 36 రేషన్ షాపులుండగా.. ఒక్కో షాపుకు 140 బ్యాగుల ద్వారా 70 క్వింటాళ్ల బియ్యం ప్రతి నెలా సరఫరా చేస్తున్నారు. వీటిలో చిరిగిన సంచులే అధికంగా ఉండడంతో సుమారు 50 నుంచి 80కిలోల వరకు బియ్యం తక్కువ వస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు. దీంతో లబ్ధిదారులకు తక్కువవుతున్న బియ్యాన్ని తమ కార్డు ద్వారా తీసుకొని పంపిణీ చేస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బియ్యం తక్కువుంటే ఏం సమాధానం చెప్పాలో తెలియడం లేదని, వారి వద్ద తాము దోషులుగా మిగిలిపోతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. ఈ సంచులను అమ్మడం ద్వారా వచ్చే డబ్బులు హమాలీ ఖర్చులకు సరిపోతాయని, కాని చిరిగినవి రావడంతో ఎవరూ కొనకపోవడంతో రెండు రకాలుగా నష్టపోతున్నామని పేర్కొన్నారు. డీలర్లకు సరఫరా చేసే బియ్యాన్ని సంచుల చొప్పున కాకుండా వే బ్రిడ్జిపై కాంటా పెట్టి అందించాలని, బిల్లును కూడా ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకోవాలని డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి ఖాసీంను కోరారు.

# కట్ట తెగి తొమ్మిది నెలలైనా పట్టించుకోరా?

- రైతుల సమస్యలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత
- రాజులకొత్తపల్లిలో తెగిన చెరువుల పరిశీలన



రాజులకొత్తపల్లిలో తెగిన చెరువు కట్టను పరిశీలిస్తున్న మాలోత్ కవిత

నెల్లికుదురు, జూన్ 3 : గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు తెగిన చెరువు కట్టలకు తొమ్మిది నెలలైనా మరమ్మతులు చేయలేదని.. రైతులు పంటలు ఎలా పండిస్తారని మాజీ ఎం పీ, బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత ప్రభుత్వాన్ని ప్ర శ్నించారు. నెల్లికుదురు మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామంలో తెగిన చెరువు కట్టను మంగళవారం ఆమె పరిశీలించారు. అక్కడి నుంచే కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. అనంతరం కవిత మాట్లాడుతూ చెరువు కట్టకు మరమ్మతులు చేయకపోవడం వల్ల ఇప్పటికే రైతులు రెండు పంటలు నష్టపోయారని, వానకాలం స మీపిస్తున్నా ప్రభుత్వం రైతుల సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. రాజులకొత్తపల్లి చెరువు కింద సుమారు 800 ఎకరాలు, రావిరాల చెరు వు కింద 400 ఎకరాలు సాగవుతాయని వెంట నే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత గతంలో కురిసిన వర్షాలకు శ్రీరామగిరి నుంచి రాజులకొత్తపల్లి వెళ్లే పీఎంజీఎస్‌వై రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు నల్లాని నవీన్‌రావు, శ్రీనివాస్, కళాధర్ రాజు, వివేక్, యాకి రెడ్డి, పుల్లారెడ్డి, వినోద్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

## ముందస్తు ప్రణాళికతో
# మహా మేడారం

**అధికారుల సమీక్షలో మంత్రి సీతక్క**

ములుగురూరల్, జూన్ 3: 2026లో జరగనున్న మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరను విజయవంతం చేసేందుకు ముందస్తు ప్రణాళికతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ టీఎస్ దివాకరతో కలిసి అధికారులతో నిర్వహించిన సమీక్షలో మేడారం జాతర, వానకాలంలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే రూ.33 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, మరో రూ.100 కోట్లను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల నిర్మాణం చేపట్టాలని, పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వానకాలంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో 3 నెలలకు సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపడుతూ అధికార యంత్రాంగం సమష్టిగా పనిచేసి ప్రజలకు భరోసా ఇవ్వాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద వంట చేసుకుంటున్న బాధితులు



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద చాపలు వేసుకొని పడుకున్న బాధితులు

# 'డబుల్' ఇళ్ల బాధితుల ఆందోళన

- తమకు కేటాయించినవి తమకే ఇవ్వాలని డిమాండ్
- అప్పటి వరకు ధర్నా విరమించం.. ఇండ్ల ముందు వంటావార్పు

హనుమకొండ, జూన్ 3: హనుమకొండ అంబేద్కర్‌నగర్‌లోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద బాధితులు ఆందోళన చేపట్టారు. తమకు కేటాయించిన వాటిని తమకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం తాళాలు పగలగొట్టి ఇంటి లోపలికి వెళ్లారు. అక్కడే వంట చేసుకుని, చాపలు వేసుకొని పడుకొన్నారు. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గత ప్రభుత్వం 2015లోనే అంబేద్కర్‌నగర్‌లో 53 మందికి, జితేందర్ నగర్‌లో 64 మందికి కలిపి మొత్తం 117 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చిందన్నారు. ప్రొసీడింగ్ ఇచ్చిన అధికారులు ఇప్పటి వరకు ఇండ్లు కేటాయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా గుడిసెల్లో చెత్త డంపింగ్ యార్డు పక్కన ఉంటున్నామని, దుర్వాసన, దోమలతో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా స్థానిక ఎమ్మెల్యే అర్హులైన నిరుపేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని వాపోయారు. విషయం తెలుసుకున్న సుబేదారి పోలీసులు డబుల్ బెడ్‌రూం ప్రాంతానికి చేరుకొని బాధితులతో మాట్లాడినా వినకుండా అధికారులు, ఎమ్మెల్యే వచ్చే వరకు ఇక్కడే ఉంటామని భీష్మించుకొని కూర్చున్నారు. రాత్రి వరకు కూడా అధికారులు, ఎమ్మెల్యే రాకపోవడంతో అక్కడే ఉన్నారు. డబుల్‌బెడ్ రూంలు అప్పగించే వరకు ధర్నాను విరమింప చేయమని, బుధవారం నుంచి మరింత ఉధృతం చేస్తామని బాధితులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్, జితేందర్‌సింగ్ నగర్‌కు చెందిన సౌరం రఘు, ఎర్ర చంద్రమౌళి, ఓరుగంటి స్వామి, కొయ్యడ కృష్ణ, దరికి రమేశ్, బొచ్చు సరోజన, మోర శిల్ప, వంటేరు కిరీటతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.




- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్

ధర్నా చేస్తున్న సంఘం సభ్యులు

# రైతు భరోసా విడుదల చేయాలని ధర్నా

ఖిలావరంగల్, జూన్ 3 : రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్ మాట్లాడుతూ 2024 వాన కాలం పంటకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు రైతు భరోసా ఇవ్వలేదన్నారు. ఈ ఖరీఫ్‌లో 70 లక్షల మంది రైతులకు రూ.7,320 కోట్లు రైతు భరోసాను సమయానికి విడుదల చేస్తే వారు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తారన్నారు. విత్తనోత్పత్తి రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు విత్తన చట్టం లేకపోవడం వల్ల రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని పేర్కొన్నారు. అన్ని పంటల విత్తనాలు కలిసి రాష్ట్రానికి 20 లక్షల క్వింటాళ్లు కావాలన్నారు. ఏటా కల్తీ విత్తనాల వల్ల రైతులు నష్టపోయినా వ్యవసాయ శాఖ నిర్లిప్తంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో చేరుతున్నామని ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ 2024-25లో ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రైతు బీమా పరిహారం తెలంగాణకు రాలేదన్నారు. కనీసం 2025-26లో మొత్తం రైతుల పంటల ఆధారంగా 2025 జూన్ 15 నాటికి కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం ప్రీమియం చెల్లించాలన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో 4 పంటలకు కేంద్ర ప్రభుత్వం కంటే అదనపు కనీస మద్దతు ధరలు ప్రకటించిందని, సన్న ధాన్యానికి మినహా ఏ పంటకు కూడా బోనస్ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో చింతమల్ల రంగయ్య, జిల్లా కార్యదర్శి ఈసంపల్లి బాబు, జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు ఇస్లావత్ నెహ్రూ, శ్రీనివాసరెడ్డి, కొంగర నరసింహస్వామి, కోడెం రమేశ్, మంద అఖిల్, ఈసంపల్లి మహేందర్, లక్కరాజు, పస్తం ఎల్లయ్య ఇజ్జగిరి కనకమల్లు, కొండ్లె మల్లయ్య, అక్కపెల్లి సుధాకర్, గొర్రె సంజీవరెడ్డి పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల లొల్లి..**



ఐనవోలులో ఎమ్మెల్యే నాగరాజును నిలదీస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

# ఎమ్మెల్యే నాగరాజుకు నిరసన సెగ

- అర్హత ఉన్నా జాబితాలో పేర్లు రాలేదని నిలదీసిన సొంత పార్టీ నాయకులు
- రీ సర్వే చేయించాలని కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- ఐనవోలులో మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో చేదు అనుభవం



కలెక్టర్ ప్రావీణ్యకు గోడును విన్నవిస్తున్న కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు

ఐనవోలు, జూన్ 3 : ఇందిరమ్మ ఇళ్ల కోసం నిరసనలు, నిలదీతల పర్వం కొనసాగుతోంది. కొన్నిచోట్ల పేద ప్రజలే గాక సొంత పార్టీ నాయకుల నుంచే కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చేదు అనుభవం ఎదురవుతోంది. అర్హుల జాబితా నుంచి పేరు తొలగించారని నిన్న స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఓ మహిళ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాళ్లు పట్టుకొని కన్నీళ్లు పెట్టుకోగా, తాజాగా మంగళవారం ఐనవోలులో అర్హులకు కాకుండా పక్కా ఇళ్లు, ఆస్తులున్న వారికి ఇళ్లు ఎలా మంజూరు చేస్తారంటూ వర్ధన్నపేట ఎమ్మెల్యేను సొంత పార్టీ కార్యకర్తలే నిలదీశారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్నామని.. అయినా తమను పట్టించుకోవడం లేదంటూ ఎమ్మెల్యే తీరుపై అసహనం వ్యక్తంచేసిన నాయకులు.. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు.

ఐనవోలు మండలకేంద్రంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు హాజరయ్యారు. మండలవ్యాప్తంగా 470 మంది లబ్ధిదారులు ఎంపిక కాగా, 336 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. ఐనవోలులో 60 మంది లబ్ధిదారుల్లో 37 మందికి మంజూరు పత్రాలను అందజేశారు. కాగా ఐనవోలుకు చెందిన సుమారు 20 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశం ముగించుకొని వెళ్తున్న ఎమ్మెల్యేను నిలదీశారు. అర్హులకు కాకుండా పక్కా ఇండ్లు, భూములు, ఆస్తులున్న వారి పేర్లు ఇండ్ల జాబితాలో ఎలా వచ్చాయంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. నిజమైన లబ్ధిదారుల ఎంపిక కోసం రీ సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలను పట్టించుకోవడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీ లేక ఎమ్మెల్యే అక్కడినుంచి వెళ్లిపోయారు. అంతకుముందు ఐనవోలు గ్రామస్తులు కలెక్టర్ ప్రావీణ్యను కలిసి అర్హులకు ఇండ్లు ఇవ్వాలని విన్నవించగా, అర్హత ఉండి పేదలకు లబ్ధి చేకూరకపోతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## బతుకుదెరువుకు పోతే లిస్టు నుంచి పేరు తీసేశారు



'గ్రామంలో ఉండేందుకు మాకు ఇల్లు లేదు. బతుకుదెరువు కోసం కుటుంబసభ్యులందరం కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నం. మాకు సంబంధించిన అన్ని ఆధారాలు కక్కిరాలపల్లి ఊరు పేరు మీదే ఉన్నాయి. అయితే ఇక్కడ నివాసం ఉండడం లేదని, ఎవరో కావాలనే ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో నుంచి పేరు తీసేశారు' అంటూ కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన తూళ్ల రజిత కంటతడి పెట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

– తూళ్ల రజిత, కక్కిరాలపల్లి, ఐనవోలు

## 5 నుంచి బలార్ష సెక్షన్‌లో పలు రైళ్ల రద్దు

కాజీపేట, జూన్ 3 : కాజీపేట-బలార్ష సెక్షన్‌లో ఈ నెల 5 నుంచి 20 వరకు పలు ప్రయాణికుల రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బెల్లంపల్లి-రేచిన్ రైల్వే స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో లైన్ ఇంటర్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కాజీపేట-సిర్పూర్ టౌన్ (17003), బలార్ష-కాజీపేట (17004) మధ్య నడిచే రామగిరి, కాజీపేట-బలార్ష (17035) మధ్య నడిచే బలార్ష ఎక్స్‌ప్రెస్, బలార్ష-కాజీపేట (17036) మధ్య నడిచే కాజీపేట ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్/సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (12757/12758) కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను 20 వరకు, అలాగే నాగపూర్-సికింద్రాబాద్/సికింద్రాబాద్-నాగపూర్ (20101/20102) వందేభారత్ రైలును ఈ నెల 19, 20 తేదీల్లో రద్దు చేశారు. గోరఖ్‌పూర్-యశ్వంతపూర్ (22533) ను ఈ నెల 9, 16, యశ్వంతపూర్-గోరఖ్‌పూర్ (22534)ను 11, 18 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు మరికొన్ని రైళ్ల రద్దు చేయగా, వారాంతపు రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నామని అధికారులు వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఛాన్స్‌లర్ దీపక్‌గార్గ్

## 6న ఎస్సార్‌యూలో 3వ స్నాతకోత్సవం

హసన్‌పర్తి, జూన్ 3 : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో ఈనెల 6న 3వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వైస్ ఛాన్స్‌లర్ దీపక్‌గార్గ్ తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్నాతకోత్సవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ సలహాదారుడు, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సతీశ్ రెడ్డి హాజరవుతారని అన్నారు. అలాగే సినీ గేయ రచయిత, గాయకుడు, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణికి డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. స్నాతకోత్సవంలో డిగ్రీల ప్రదానం, గ్రాడ్యుయేట్లకు పతకాలు అందజేస్తామన్నారు. ఈ వేడుకలకు సుమారు 3 వేల మంది పూర్వ విద్యార్థులు హాజరవుతారని దీపక్‌గార్గ్ తెలిపారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

హనుమకొండ చౌరస్తా, జూన్ 3: ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మే 19 నుంచి జూన్ 3వరకు జరిగిన హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ జిల్లాల క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొనగా, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 19 మందితో సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అఫ్జల్, పవన్ పర్యవేక్షణలో జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ జట్టు జూన్ రెండో వారంలో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించనున్న హెచ్‌సీఏ టుడే లీగ్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

జట్టులో బీ వరుణ్(కెప్టెన్), కే రోహిత్‌రెడ్డి, ఎం శివరామ్, ఎన్ రాహుల్, ఏ లక్ష్మణ్, ఎం దేవేందర్, పీ రిశ్వంత్, ఎం రామ్‌చరణ్, ఎస్ ఆదర్శ్, ఎం రోహిత్, వీ వైష్ణవ్, జే పార్థీపన్, డీ మనోజ్, బీ మణిదీప్‌సింగ్, ఎం రానాచరణ్, నితిన్ పటేల్, పీ సంతోష్, బీ సతీశ్, పూజిత్ ఉన్నారు.



ఎంపికైన జట్టుతో క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్